సాక్షి సంగారెడ్డి

బుధవారం । 13 । సెప్టెంబర్ । 2023



ప్రోత్సాహం కరువు!

మట్టి గణపతి విగ్రహాలను తయారు చేసేవారికి ప్రభుత్వం ఎలాంటి ప్రోత్సాహం అందించడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వివరాలు 8లో ▸



హత్యా.. ఆత్మహత్యా?

జహీరాబాద్‌లోని అల్లీపూర్ వద్ద రైలు పట్టాలపై అనుమానాస్పద స్థితిలో మృతిచెందిన యువతి శవాన్ని మంగళవారం రైల్వే పోలీసులు గుర్తించారు. వివరాలు 8లో ▸



ఆరోగ్య తెలంగాణే లక్ష్యం

ఆరోగ్య తెలంగాణే లక్ష్యం అని టీఎస్‌హెచ్‌డీసీ చైర్మన్ చింతా ప్రభాకర్ అన్నారు. వివరాలు 9లో ▸

న్యూస్‌రీల్

డైట్ కళాశాల మంజూరు

నారాయణఖేడ్: ఖేడ్‌కు నూతన డైట్ కళాశాల మంజూరైందని ఎమ్మెల్యే ఎం.భూపాల్‌రెడ్డి తెలిపారు. ఆ మేరకు ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చిందన్నారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. నియోజకవర్గంలో విద్యావ్యవస్థను పటిష్టం చేసేందుకు తాను కృషి చేస్తున్నానన్నారు. ఇప్పటికే వివిధ గురుకులాలు, ఆదర్శ పాఠశాలలు, సమీకృత వసతిగృహం, జూనియర్, డిగ్రీ, పాలిటెక్నిక్ కళాశాలలు ఏర్పాటయ్యాయని అన్నారు. భవిష్యత్‌లో బీఎడ్ కళాశాలనూ మంజూరు చేయిస్తానని చెప్పారు.

కాల్వలు మూసుకుపోవటమే కారణం



పారిశ్రామికవాడలో పర్యటిస్తున్న ఆర్డీఓ, అధికారులు

జిన్నారం(పటాన్‌చెరు): పరిశ్రమలను కలుపుతూ ఏర్పాటు చేసిన కాల్వలు మూసుకుపోవటంతోనే లోపలికి నీరు చేరుతోందని, దీంతో ఉత్పత్తులను నిలిపివేయాల్సి వస్తోందని ఆర్డీఓ రవీందర్‌రెడ్డికి పరిశ్రమల ప్రతినిధులు విన్నవించారు. సమస్యను పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. మండలంలోని గడ్డపోతారం పారిశ్రామికవాడల్లోని పలు పరిశ్రమలు వర్షం పడుతున్న సమయంలో మునిగిపోవటాన్ని ఆ యాజమాన్యాలు కలెక్టర్‌కు ఫిర్యాదు చేయగా, మంగళవారం ఆయన పర్యటించి, ఆయా పరిశ్రమల ప్రతినిధులు, స్థానిక నేతలతో మాట్లాడారు. పాత కాల్వలను పునరుద్ధరించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. లేనిపక్షంలో కొత్తవి నిర్మించాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ ప్రకాశ్‌చారి, డిప్యూటీ తహసీల్దార్ మల్లికార్జున్, సర్వేయర్ రామభద్ర, ఇరిగేషన్ ఏఈఈ దిలీప్, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

విద్యార్థులు లక్ష్యం పెట్టుకోవాలి



విద్యార్థినులతో మాట్లాడుతున్న రమణ కుమార్

రామచంద్రాపురం(పటాన్‌చెరు): విద్యార్థులు చిన్ననాటి నుంచే ఒక లక్ష్యాన్ని ఏర్పాటు చేసుకొని సాధనకు కృషి చేయాలని తెలంగాణ మోడల్ స్కూల్స్ అడిషనల్ డైరెక్టర్ రమణకుమార్ అన్నారు. మంగళవారం తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని వెలిమెల ప్రభుత్వ మోడల్ పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా పదో తరగతి, ఇంటర్మీడియట్ విద్యార్థులతో ముచ్చటించి, పలు విషయాలపై ప్రశ్నలు వేసి జవాబులు రాబట్టారు. ఉపాధ్యాయుల పనితీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఇష్టంతో చదివి మంచి ఫలితాలు సాధించాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

భజన పాటలతో నిరసన



నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

సంగారెడ్డి టౌన్: కనీస వేతనాలు అమలు చేయాలని కోరుతూ సమగ్ర శిక్షా అభియాన్ ఉద్యోగులు కొనసాగిస్తున్న దీక్ష తొమ్మిదోవ రోజైన మంగళవారం.. శిబిరంలో సీఎం కేసీఆర్ చిత్రపటం పెట్టి భజన పాటలతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కమిటీ అధ్యక్షుడు శేషాద్రి మాట్లాడుతూ ప్రభుత్వం తమ సేవలను గుర్తించకపోవడం దారుణమన్నారు. కార్యక్రమంలో దత్తు, నరేశ్, రాజు ధనలక్ష్మి, శిరీష తదితరులు పాల్గొన్నారు.

రెగ్యులర్ చేయాలని...



నిరసన వ్యక్తం చేస్తున్న ఉద్యోగులు

సంగారెడ్డి మున్సిపాలిటీ: ఔట్ సోర్సింగ్ విధానంలో పనిచేస్తున్న తమను పర్మినెంట్ చేయాలని కోరుతూ మంగళవారం భోజన విరామం సమయంలో సుల్తాన్‌పూర్ జేఎన్‌టీయూ ఉద్యోగుల నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఉద్యోగ భద్రత కార్డు, ఏజెన్సీ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కొన్నేళ్లుగా చాలీచాలని జీతాలతో పనిచేస్తున్నామన్నారు.

ఎరువులకు పైసల్లేవ్!

- ఫర్టిలైజర్స్ సరఫరాపై చేతులెత్తేస్తున్న 14 సహకార సంఘాలు
- తొమ్మిది సంఘాలకు బ్యాంక్ గ్యారెంటీలపై సప్లయి
- ప్రాథమిక విధులను గాలికొదిలేసిన పీఏసీఎస్‌లు
- యూరియా కోసం ప్రైవేటు డీలర్లను ఆశ్రయిస్తున్న రైతులు



గతంలో పీఏసీఎస్‌లకు అరువుపై..

సాక్షిప్రతినిధి, సంగారెడ్డి: రైతులకు అండగా నిలవాల్సిన సహకార సంఘాలు (పీఏసీఎస్‌లు) ఆర్థిక ఇబ్బందుల్లో కొట్టుమిట్టాడుతున్నాయి. ఆయా సంఘాల వద్ద కనీస ఆర్థిక నిల్వలు లేక ఎరువులను కూడా సరఫరా చేయలేకపోతున్నాయి. నగదు చెల్లిస్తే కానీ పంపబోమని మార్క్‌ఫెడ్ తేల్చి చెబుతోంది. దీంతో జిల్లాలో 14 సహకార సంఘాలు నగదు చెల్లించి కొనుగోలు చేయలేక పూర్తిగా వాటి సరఫరానే నిలిపేశాయి. దీంతో ఆయా సంఘాల పరిధిలోని రైతులు ప్రైవేటు ఎరువుల డీలర్లను ఆశ్రయించాల్సి వస్తోంది. ప్రధానంగా యూరియా బస్తాల కోసం సమీపంలోని పట్టణాలకు వెళ్లాల్సి వస్తోంది. ఆగ్రోస్, హాకా వంటి సెంటర్లు లేని ప్రాంతాల్లోని వారు మరింత ఇబ్బందులు పడుతున్నారు.

గతంలో మార్క్‌ఫెడ్ అరువుపై సహకార సంఘాలకు ఎరువులను సరఫరా చేసేది. కొన్ని సంఘాల్లో బకాయిలు రూ.కోట్లలో పేరుకుపోవడంతో ఈ ఏడాది నుంచి ఆపేసింది. ముందుగా డబ్బులు చెల్లిస్తేనే పంపుతోంది. కనీసం వీటిని కొనుగోలు చేసేందుకు నగదు లేకపోవడంతో 14 సంఘాలు తమ పరిధిలోని రైతులకు సరఫరా నిలిపేశాయి. దీంతో వారు ప్రైవేటు డీలర్ల వద్దకు వెళ్తున్నారు.

బ్యాంక్ గ్యారెంటీతో..

ఎరువుల సరఫరా విషయంలో 14 పీఏసీఎస్‌లు పూర్తిగా చేతులెత్తేశాయి. దీంతో మరో తొమ్మిది మాత్రం బ్యాంక్ గ్యారెంటీపై సరఫరా చేస్తున్నాయి. ఈ సంఘాల వద్ద కూడా డబ్బులు లేకపోవడంతో డీసీసీబీ (జిల్లా కేంద్ర సహకార బ్యాంకు) గ్యారంటీ మేర అరువుపై పంపుతున్నాయి. జిల్లాలో మొత్తం 53 సహకార సంఘాలుండగా, ప్రస్తుతం 39లో మాత్రమే సరఫరా అవుతున్నట్లు అధికారుల పరిశీలనలో తేలింది.

ప్రాథమిక విధులు గాలికి..

పంట రుణాలు మంజూరు, ఎరువులు, సబ్సిడీ విత్తనాల సరఫరా, వ్యవసాయ అనుబంధ రుణాలివ్వడం వంటివి సహకార సంఘాల ప్రాథమిక విధులు. కానీ ఆర్థిక క్రమశిక్షణ కరువై తీవ్ర ఆర్థిక సంక్షోభంలో మునిగిపోతున్న ఇవి కనీస విధులను కూడా నిర్వర్తించలేకపోతున్నాయి.

ఎక్కువ ధరలకు విక్రయాలు

సహకార సంఘాల్లో యూరియా, ఎరువులు అందుబాటులో లేకపోవడంతో రైతులు తప్పనిసరి పరిస్థితుల్లో ప్రైవేటుగా కొనుగోలు చేయాల్సి వస్తోంది. దీన్ని ఆసరాగా చేసుకుని కొందరు డీలర్లు చేతివాటం ప్రదర్శిస్తున్నారనే ఆరోపణలున్నాయి. వీటిని ఎమ్మార్పీ కంటే ఎక్కువ ధరలకు విక్రయిస్తున్నారనే విమర్శలూ వ్యక్తమవుతున్నాయి. తమకు అందివచ్చిన అవకాశాల మాటున వీరు యూరియా బస్తాలు కావాలంటే ఇతర ఉత్పత్తులు కొనుగోలు చేయాలని చెబుతున్నారని రైతులు వాపోతున్నారు.

సర్కారు ఆస్పత్రుల్లో సేవలు భేష్



వైద్యులతో యూనిసెఫ్ బృందం సభ్యులు

యూనిసెఫ్ బృందం కితాబు

సంగారెడ్డి మున్సిపాలిటీ: ప్రభుత్వ ఆస్పత్రుల్లో అందిస్తున్న సేవలు బాగున్నాయని, వాటి నిర్వహణ, రోగులపై తీసుకుంటున్న శ్రద్ధ, వైద్యసేవలను యూనిసెఫ్ బృందం అభినందించింది. మంగళవారం సుమారు 35 మంది జాతీయ ప్రతినిధులు రెండు బృందాలుగా ఏర్పడి పట్టణంలోని జిల్లా ఆస్పత్రిని, మాతా,శిశు సంరక్షణ హాస్పిటల్‌ను సందర్శించారు. పిల్లలకు, గర్భిణులకు పౌష్టికాహారం, వ్యాక్సినేషన్లు, వైద్యులు, సిబ్బంది అందిస్తున్న సహకారాలను అడిగి తెలుసుకున్నారు. మాతా, శిశు మరణాల రేటు తగ్గుదలకు తీసుకుంటున్న చర్యలపై ఆరా తీశారు. అనంతరం కలెక్టరేట్‌లో ప్రతినిధులు రెండు గంటలపాటు సమయం వెచ్చించారు. బృందం వెంట డీఎంహెచ్‌ఓ డాక్టర్ గాయత్రిదేవి, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ అనిల్‌కుమార్, డాక్టర్ శశాంక్, పిల్లల విభాగపు హెచ్‌ఓడీ షబ్బీర్, డాక్టర్ సుమిత్ర, ఇతర వైద్యులు, తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రం సందర్శన

కొండాపూర్ (సంగారెడ్డి): మండల పరిధిలోని చెర్లగోపులారం, గొల్లపల్లిలోని అంగన్‌వాడీ కేంద్రాలను మంగళవారం 17 మంది సభ్యులు గల యూనిసెఫ్ బృందం సందర్శించింది. ఈ సందర్భంగా ఎర్లీ చైల్డ్ డెవలప్మెంట్‌పై తల్లులు, చిన్నపిల్లలకు కల్పిస్తున్న అవగాహనపై ఆరా తీసింది. జీరో నుంచి మూడు సంవత్సరాల వరకు పిల్లల స్కిల్ డెవలప్మెంట్ కదలికలపై తల్లులకు ఏ విధంగా ప్రోత్సహించి అవగాహన కల్పిస్తున్నారనే విషయాన్ని అంగన్‌వాడీ టీచర్‌ను, అధికారులను అడిగి తెలుసుకుంది. బృందం వెంట అడిషనల్ కలెక్టర్ చంద్రశేఖర్, చైల్డ్ వెల్ఫేర్ ప్రాజెక్ట్ డైరెక్టర్ సంధ్యారాణి, ఎంపీడీవో మధులత, సర్పంచ్ ప్రకాష్ ఉన్నారు.

ప్రజారోగ్యంతో చెలగాటమాడారు

- పర్సంటేజీలు తీసుకున్నారు
- కాంగ్రెస్ పాలనపై ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి



మహిళారోగ్య కేంద్రం ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

కల్హేర్(నారాయణఖేడ్): కాంగ్రెస్ హయాంలో వైద్య రంగాన్ని విస్మరించి ప్రజల ఆరోగ్యంతో చెలగాటం ఆడారని ఎమ్మెల్యే ఎం.భూపాల్‌రెడ్డి మండిపడ్డారు. మంగళవారం కల్హేర్ ప్రభుత్వ ఆస్పత్రిలో మహిళ ఆరోగ్య కేంద్రం ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడారు. ఇక్కడ గతంలో ఎమ్మెల్యేలుగా పనిచేసిన నేతలు సొంత ఆస్పత్రులు నడిపారని ధ్వజమెత్తారు. పర్సంటేజీలు తీసుకుని ఇతర హాస్పిటల్స్‌కు రిఫర్ చేసి దోచుకున్నారని విమర్శించారు. ప్రజలను అన్యాయం చేశారని ఆరోపించారు. బీఆర్‌ఎస్ సర్కారు ఈ రంగంలో మార్పులు తీసుకొచ్చిందన్నారు. పేదలకు ఉచితంగా వైద్యం అందిస్తోందని కొనియాడారు. తాను ఎమ్మెల్యేగా ఎన్నికయ్యాక ఖేడ్‌లో 100 పడకల ఆస్పత్రి, డయాలసిస్ సెంటర్, ఆక్సిజన్ ప్లాంట్ అందుబాటులోకి వచ్చిందని వెల్లడించారు. కల్హేర్, కరసుగుత్తిలో సీహెచ్‌సీలు ఏర్పాటు చేశామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఆత్మ చైర్మన్ రాంసింగ్, ఎంపీపీ సుశీల అంజయ్య, జెడ్పీటీసీ నర్సింహారెడ్డి, డాక్టర్ జెబబేగం, కోఆప్షన్ సభ్యుడు ఎంఏ.ఘని, సర్పంచ్ కిష్టారెడ్డి, ఎంపీటీసీ సంగప్ప, పీఏసీఎస్ చైర్మన్లు గంగారెడ్డి, సంగారెడ్డి, నాయకులు వెంకట్‌రెడ్డి, హన్మంత్‌రావు, గోపాల్‌రెడ్డి, భూపాల్ పాల్గొన్నారు.

చెరకు రైతుల మహాధర్నా

- ట్రైడెంట్ యాజమాన్యం బకాయిలు చెల్లించాలని డిమాండ్
- రహదారిపై రెండు గంటలపాటు బైఠాయింపు
- ఆందోళనకారులకు అఖిలపక్షం నేతల మద్దతు



65వ జాతీయ రహదారిపై బైఠాయించిన అఖిలపక్షం నాయకులు, రైతులు

జహీరాబాద్: ఆరుగాలం కష్టించి పండించిన చెరకు పంటను కర్మాగారానికి తరలించినా బిల్లులు రాకపోవడంతో ఆగ్రహించిన రైతులు బుధవారం పట్టణంలో మహాధర్నా నిర్వహించారు. తొలుత మండలంలోని పస్తాపూర్ గ్రామంలోని పీవీఆర్ గార్డెన్ నుంచి పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహం వరకు చెరకు గడలతో భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం 65వ జాతీయ రహదారిపై రెండు గంటల పాటు బైఠాయించారు. ఈ సందర్భంగా ట్రైడెంట్ యాజమాన్యానికి, ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలిచ్చారు. రాజకీయ పార్టీలకతీతంగా నిర్వహించిన ఆందోళనలో నేతలు పాల్గొన్నారు. కాగా, రైతులు, అఖిలపక్షం నేతల బైఠాయింపుతో ట్రాఫిక్ స్తంభించింది. ఘటనా స్థలికి చేరుకున్న పోలీసులు వాహనాలను దారిమళ్లించారు. కార్యక్రమంలో డీసీసీబీ మాజీ చైర్మన్ ఎం.జైపాల్‌రెడ్డి, కాంగ్రెస్ నియోజకవర్గం సమన్వయకర్త ఎన్.గిరిధర్‌రెడ్డి, నాయకులు పి.నర్సింహారెడ్డి, గుండ్‌రెడ్డి, మక్సూద్, బీజేపీ నాయకులు రాంచందర్ రాజనర్సింహ, జగన్, శ్రీనివాస్‌గౌడ్, టీజేఎస్ నియోజకవర్గం కన్వీనర్ ఆశప్ప, బీఎస్పీ నాయకుడు సిద్ధు రావణ్, సీపీఎం నాయకుడు రాంచందర్, రైతు సంఘం నాయకులు కొండల్‌రెడ్డి, మాధవరెడ్డి, రైతులు పాల్గొన్నారు

ప్రభుత్వానికి బాధ్యత లేదా? : కోదండరాం

ట్రైడెంట్ యాజమాన్యం రూ. 9 కోట్ల మేర బకాయిలను చెల్లించడంలో జాప్యం చేస్తే జాతీయ రహదారిని దిగ్బంధం చేస్తామని టీజేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు కోదండరాం అన్నారు. వీటిని ఇప్పించే బాధ్యత ప్రభుత్వానికి లేదా? అని ప్రశ్నించారు. రైతులు సరఫరా చేసిన దానికే బిల్లులు అడుగుతున్నారన్నారు. ప్రభుత్వంపై ఒత్తిడి పెంచేందుకు గాను ఐక్యతతో ఉండాలని పిలుపునిచ్చారు. వీరికి న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగిస్తామన్నారు.

వారంలో వడ్డీతో సహా చెల్లించాలి: కోదండరెడ్డి

కాంగ్రెస్ హయాంలో చెరకు ధరను ప్రకటించే సమయంలో రైతులు, యాజమాన్యాలు, అధికారులతో సమావేశాలు నిర్వహించామని జాతీయ కిసాన్ సెల్ ఉపాధ్యక్షుడు కోదండరెడ్డి గుర్తుచేసుకున్నారు. టీడీపీ ప్రభుత్వం హయాంలో నిజాం చక్కెర కర్మాగారాలను ప్రైవేటు పరం చేసిందన్నారు. బకాయిలను వారం రోజుల్లో వడ్డీతో సహా చెల్లించాలని డిమాండ్ చేశారు. కిసాన్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు అన్వేష్‌రెడ్డి మాట్లాడుతూ, బీఆర్‌ఎస్ ప్రభుత్వ పాలనలో సంప్రదాయ పంటలైన చెరకు, పసుపు, మిర్చి పంటలు అంతరించిపోయే పరిస్థితి ఏర్పడిందన్నారు. సామాజిక ఉద్యమకారుడు ఢిల్లీ వసంత్ మాట్లాడుతూ యాజమాన్యమే చెరకు కోత, రవాణా బాధ్యతలు చేపట్టాలన్నారు.

అవసరమైతే రికవరీ చట్టం ప్రయోగిస్తాం : హరీశ్



అధికారులు, యాజమాన్యంతో సమావేశమైన మంత్రి హరీశ్‌రావు

జహీరాబాద్: రైతులకు చెల్లించాల్సిన బకాయిల విషయంలో యాజమాన్యం నిర్లక్ష్యం వహిస్తుండటంపై ఆర్థిక మంత్రి టి.హరీశ్‌రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం హైదరాబాద్‌లోని తన చాంబర్‌లో అధికారులు, యాజమాన్యంతో ప్రత్యేకంగా సమావేశం నిర్వహించారు. గతంలో ఇచ్చిన హామీని నిలబెట్టుకోక పోవడంపై అసంతృప్తి వ్యక్తంచేశారు. ఈ విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించడాన్ని సహించబోమన్నారు. ప్రభుత్వం రెవెన్యూ రికవరీ చట్టాన్ని ప్రయోగించి కర్మాగారాన్ని మరొకరికి అమ్మివేసి నడిపించడానికి వెనుకాడబోమని ఈ సందర్భంగా హెచ్చరించారు. కాగా, యాజమాన్యం స్పందిస్తూ ఈనెల 20వ తేదీ వరకు బకాయిలను చెల్లించేందుకు సుముఖత వ్యక్తం చేసింది. ప్రభుత్వం స్వాధీనం చేసుకుని మరొకరికి అమ్మివేసేందుకు అంగీకార పత్రం రాసి ఇస్తున్నట్లు పేర్కొంది. సమావేశంలో ట్రైడెంట్ ఎం.డీ రామ్‌నాథ్, ఎంపీ బీబీ పాటిల్, ఎమ్మెల్యే కె.మాణిక్‌రావు, కలెక్టర్ శరత్, ఎస్పీ రమణకుమార్, ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ వై.నరోత్తం, ఐడీసీ చైర్మన్ ఎండీ.తన్వీర్, డీసీఎంఎస్ చైర్మన్ ఎం.శివకుమార్, కేన్ కమిషనర్ భద్రు, సీడీసీ చైర్మన్ ఉమాకాంత్ పాల్గొన్నారు.

పరీక్ష రాసి వస్తూ మృత్యుఒడికి..

అనంతసాగర్ వద్ద ఘోర రోడ్డు ప్రమాదం

- ముగ్గురు బీటెక్ విద్యార్థుల దుర్మరణం
- మరో ఎనిమిది మందికి తీవ్ర గాయాలు
- మృతుల కుటుంబాల్లో తీరని విషాదం



విపిన్ చంద్ర



నాగరాజు



గ్రీష్మ



లారీని ఢీకొన్న క్వాలిస్, విద్యార్థుల మృతదేహాలు

చిన్నకోడూరు(సిద్దిపేట): వారంతా బీటెక్ విద్యార్థులు.. ఎంతో సంతోషంగా పరీక్షలు రాశారు. తోటి మిత్రులతో కలిసి క్వాలిస్ వాహనంలో వెళ్తుండగా మృత్యువు మాటువేసింది. వీరు ప్రయాణిస్తున్న వాహనం ఆగిఉన్న లారీని ఢీకొట్టడంతో ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. ఈఘటనలో ముగ్గురు అక్కడికక్కడే మృతి చెందారు. మరో ఎనిమిది మంది తీవ్రంగా గాయపడ్డారు. చిన్నకోడూరు మండలం అనంతసాగర్ వద్ద మంగళవారం చోటుచేసుకున్న విషాదకర ఘటన వివరాలిలా ఉన్నాయి. సిద్దిపేట పట్టణ శివారులోని ఇందూరు ఇంజినీరింగ్ కళాశాలకు చెందిన 11 మంది బీటెక్ మొదటి సంవత్సరం విద్యార్థులు రెండో సెమిస్టర్ పరీక్షలు రాస్తున్నారు. వారంతా కలసి తోటి మిత్రుడు క్వాలిస్ వాహనం తీసుకొని ఐదు రోజులుగా కరీంనగర్ వెళ్తున్నారు. ఈ క్రమంలో మంగళవారం పరీక్ష రాసి తిరిగి వస్తున్నారు. సిద్దిపేట రూరల్ మండలం పెద్దలింగారెడ్డిపల్లికి చెందిన తౌటి దేవచంద్(20) వాహనం నడుపుతున్నాడు. అనంతసాగర్ శివారులో రోడ్డు పక్కన పార్కు చేసిన ఇసుక లారీని అతివేగంగా వచ్చిన వీరి వాహనం ఢీకొంది. దీంతో క్వాలిస్‌లో ఉన్న సిద్దిపేట పట్టణానికి చెందిన కళావిపిన్ చంద్ర (19), నేతి నాగరాజు(20), పయ్యావుల గ్రీష్మ(18) అక్కడికక్కడే మృతి చెందారు. నమ్రత (సిద్దిపేట), ప్రవళిక (దర్గపల్లి, నంగునూరు మండలం), చైతన్య (సిద్దిపేట), దేవచంద్ (పెద్దలింగారెడ్డి పల్లి)లకు తీవ్ర గాయాలు కావడంతో సికింద్రాబాద్ యశోద ఆస్పత్రికి తరలించారు. బుద్ద సాయిచంద్ (చేగుంట), రోహిత్ రెడ్డి (రామాయంపేట), కర్రె రాజు(గజ్వేల్), సాయి నితిన్ (తిమ్మాపూర్, దుబ్బాక మండలం) సిద్దిపేట ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ సుభాష్ గౌడ్ తెలిపారు. ఈ ఘటన మృతుల కుటుంబాల్లో తీరని విషాదం నింపింది.

ఆ చరిత్ర కమ్యూనిస్టులదే



మాట్లాడుతున్న వీరయ్య

సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు వీరయ్య

పటాన్‌చెరు: పేదలకు భూమి పంచిన చరిత్ర కమ్యూనిస్టులదని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు వీరయ్య అన్నారు. మంగళవారం పటాన్‌చెరులోని ఐలా భవన్‌లో సీపీఎం పటాన్‌చెరు ఏరియా కమిటీ కార్యదర్శి నర్సింహారెడ్డి అధ్యక్షతన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వార్షికోత్సవ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా వీరయ్య మాట్లాడుతూ.. భూమి, భుక్తి, వెట్టిచాకిరీ విముక్తి కోసం పోరాడిన చరిత్ర కమ్యూనిస్టులదని చెప్పారు. ఓట్ల కోసం మతాల మధ్య చిచ్చుపెట్టడం బీజేపీకి అలవాటుగా మారిందని విమర్శించారు. వీర తెలంగాణ సాయుధ పోరాటానికి నిజమైన వారసులు కమ్యూనిస్టులేనని ఉద్ఘాటించారు. లక్షల ఎకరాల భూమిని పంపిణీ చేసిన చరిత్ర కూడా తమదేనని పేర్కొన్నారు. సెప్టెంబర్ 17 అనగానే అందరూ చరిత్రను వక్రీకరించి తమ ఉనికిని కాపాడుకునే ప్రయత్నం చేస్తున్నారని, ప్రజలు వారి మాటలు నమ్మవద్దని చెప్పారు. నిజాలు తెలుసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి జయరాజు, కార్యదర్శివర్గ సభ్యుడు రాజయ్య, నాగేశ్వరరావు, శ్రీనివాస్, సత్తిబాబు జిలాని, రాజు, మనిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాలపై ఉక్కుపాదం

కలెక్టర్ శరత్



మాట్లాడుతున్న కలెక్టర్ శరత్, ఎస్పీ రమణ కుమార్

సంగారెడ్డి టౌన్: మత్తు పదార్థాలకు బానిసలు కాకుండా అవగాహన కల్పించడంతోపాటు సమూలంగా అరికట్టడం ప్రతి ఒక్కరి బాధ్యతని కలెక్టర్ శరత్ గుర్తుచేశారు. మంగళవారం కలెక్టరేట్ మినీసమావేశ మందిరంలో జిల్లా స్థాయి మాదకద్రవ్యాల నిరోధక కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన, ఎస్పీ రమణకుమార్ మాట్లాడారు. సమాజానికి పెను ప్రమాదకరంగా మారిన వీటిపై ఉక్కుపాదం మోపేందుకు సంబంధిత శాఖలు సమన్వయంతో మరింత గట్టి నిఘాతో పని చేయాల్సిన అవసరం ఉందని నొక్కిచెప్పారు. వాటి విక్రయాలపై సమాచారం తెలిస్తే వెంటనే కమిటీ దృష్టికి తెస్తే నివారణకు చర్యలు తీసుకుంటామని స్పష్టంచేశారు. గంజాయి వంటివి ఎక్కడి నుంచి జిల్లాకు చేరుతున్నాయి, ఏయే ప్రాంతాల్లో ఎవరు విక్రయిస్తున్నారు, ఏ ప్రాంతాలకు రవాణా జరుగుతోందనే వివరాలకు పక్కాగా గుర్తించి, మూలాలను అడ్డుకోగలిగితే చాలా వరకు వినియోగాన్ని నియంత్రించవచ్చన్నారు. అయితే ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశం కూడా నిర్వహించారు.

శాంతియుతంగా పండగలు జరుపుకోవాలి

గణేశ్ ఉత్సవాలు, మిలాద్ -ఉన్- నబీ పండగలను శాంతియుత వాతావరణంలో ప్రజలు జరుపుకోవాలని కలెక్టర్ శరత్, ఎస్పీ రమణకుమార్ అన్నారు. మంగళవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో వినాయక చవితి ఏర్పాట్లపై సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈనెల 18న ఉత్సవాలు ప్రారంభమవుతున్నాయని, అలాగే 28న ఈద్ మిలాద్ ఉన్‌నబీ పండగ ఉన్నందున సామరస్యంగా జరుపుకోవాలని కోరారు.

Ordnance Factory Medak, AVNL
Hyderabad, Telangana

Ordnance Factory Medak, which is constituent Production Unit of **Armoured Vehicles Nigam Limited** (AVNL) is organizing a grand sports event at **Sarath Stadium** in the Factory Estate from **15th to 17th Sep 2023**.

The Event will be inaugurated by
Shri.Sanjay Dwivedi, IOFS, ndc, CMD/AVNL on 15th Sep 2023
in the presence of **Smt.Rashmi Dwivedi**, Chairperson WWA, AVNL and **Shri.K.Sudhakar,** Chief General Manager, OF Medak.

The Sports event will comprise of Hockey, Badminton and Volleyball in which players and delegates from all the establishments of AVNL i.e. HVF Avadi, EFA Avadi, MTPT Ambernath and VFJ Jabalpur will participate. The inter unit participation will revitalize the sports activities, which had become dormant due to the pandemic and promote espirit de corps in the AVNL group. Moreover, it will set a shining example for the other DPSUs to enhance the intra as well as inter Organizational bonding through the medium of sports.

క్లుప్తంగా

అనుమానితులుంటే సమాచారమివ్వాలి

మనోహరాబాద్(తూప్రాన్): ఎవరైనా అనుమానాస్పదంగా తిరుగుతుంటే తమకు సమాచారమివ్వాలని తూప్రాన్ సీఐ శ్రీధర్ పేర్కొన్నారు. మంగళవారం మనోహరాబాద్ మండలం వెంకటాపూర్ అగ్రహారం గ్రామంలో కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సరైన ధ్రువపత్రాలు లేని 40 బైక్‌లను స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. సీఐ మాట్లాడుతూ.. గ్రామంలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. అత్యవసర సమయంలో డయల్ 100ను వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ కరుణాకర్‌రెడ్డి, తూప్రాన్, వెల్దుర్తి, శివ్వంపేట్ ఎస్ఐలు పాల్గొన్నారు.

ఫిల్లింగ్ స్టేషన్ సీజ్

వెల్దుర్తి(తూప్రాన్): వెల్దుర్తి మండలం కుకునూర్ గ్రామ శివారులోని శ్రీ వేంకటేశ్వర ఫిల్లింగ్ స్టేషన్(పెట్రోల్ బంక్)ను మంగళవారం తూనికలు, కొలతల శాఖ జిల్లా ఇన్‌స్పెక్టర్ సుధాకర్ తనిఖీ చేశారు. గడువు ముగిసినా రెన్యూవల్ చేసుకోకుండా బంక్‌ను నిర్వహిస్తుండడంతో సీజ్ చేశారు.

విద్యుత్ షాక్‌తో నెమలి మృతి

న్యాల్‌కల్(జహీరాబాద్): విద్యుత్ షాక్ తగిలి నెమలి మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని వడ్డి గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామస్తుల తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన ఓంకార్ సోమవారం ఉదయం పొలం వద్దకు వెళ్లాడు. అక్కడ విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్ సమీపంలో ఓ నెమలి మృతి చెంది ఉండటం గమనించాడు. గ్రామస్తులతో కలిసి జహీరాబాద్ ఫారెస్టు అధికారి ఇనాయత్ అలీకి సమాచారం అందించాడు. సంఘటనా స్థలానికి చేరుకున్న ఆయన నెమలి మృతికి గల కారణాలను గ్రామస్తులను అడగగా, విద్యుత్ షాక్ తగిలి మృతి చెంది ఉండవచ్చని తెలిపారు.

షార్ట్‌సర్క్యూట్‌తో హాస్టల్‌లో మంటలు

రామాయంపేట(మెదక్): పట్టణంలోని సమీకృత హాస్టల్ భవనంలో మంగళవారం రాత్రి షార్ట్ సర్క్యూట్‌తో మంటలు చెలరేగి త్రుటిలో ప్రమాదం తప్పింది. కరెంట్ మీటర్‌వద్ద ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో భయాందోళన చెందిన విద్యార్థులు బయటకు పరుగులు తీశారు. అదే సమయంలో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. సమాచారం అందుకున్న మున్సిపల్ చైర్మన్ జితేందర్‌గౌడ్, పీఏసీఎస్ అధ్యక్షుడు చంద్రం, సరాపు యాదగిరి, ఎస్ఐ రంజిత్, తదితరులు హాస్టల్‌వద్దకు చేరుకొని పరిస్థితి సమీక్షించారు. ఫైర్ ఇంజన్‌ను హాస్టల్ వద్దకు రప్పించారు. మంటలు చల్లారడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

పరిశ్రమలో అగ్నిప్రమాదం

జిన్నారం(పటాన్‌చెరు): మండల పరిధిలోని బొల్లారం పారిశ్రామిక వాడలో ఉన్న శ్రీ విలాస్ హైడ్రోటెక్ పరిశ్రమలో మంగళవారం స్వల్ప అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. అప్రమత్తమైన యాజమాన్యం ఫైర్‌స్టేషన్‌కు సమాచారం ఇచ్చారు. ఫైర్ సిబ్బంది వచ్చి మంటలను అదుపులోకి తెచ్చారు. షార్ట్‌సర్క్యూట్ వల్లే ప్రమాదం జరిగిందని యాజమాన్యం తెలిపారు. ఘటనా స్థలాన్ని బొల్లారం సీఐ నయిముద్దీన్ పరిశీలించారు.

వ్యాపారులను వేధిస్తున్న ఐదుగురు అరెస్ట్

రామాయంపేట(మెదక్): విలేకరులుగా చలామణి అవుతూ డబ్బుల కోసం వ్యాపారులను వేధింపులకు గురిచేస్తున్న కామారెడ్డి జిల్లా కేంద్రానికి చెందిన ఐదుగురు వ్యక్తులను మంగళవారం రాత్రి నార్సింగి పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. రెండు కార్లలో వచ్చిన సదరు వ్యక్తులు రామాయంపేటలోని గోదాం నుంచి నార్సింగి రైసుమిల్లుకు ధాన్యం తరలిస్తున్న లారీని ఆపి తాము విలేకరులమని, ధాన్యం పత్రాలు చూపమని లారీ డ్రైవర్‌ను బెదిరించారు. దీనితో డ్రైవర్ ఈవిషయమై రైసుమిల్లు యజమానికి సమాచారం అందజేశారు. ఆయన అనుమానంతో నార్సింగి పోలీసులకు సమాచారం అందజేశారు. పోలీసులు వారిని స్టేషన్‌కు తరలించి గుర్తింపు కార్డులను పరిశీలించి వాటిని స్వాధీనపర్చుకున్నారు. ఈమేరకు ఐదుగురిని అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి రెండు కార్లతో పాటు ఎనిమిది సెల్ ఫోన్లు, స్వాధీనపర్చుకున్నట్లు నార్సింగి ఎస్ఐ అహమ్మద్ మోహినుద్దీన్ తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

పరిశ్రమను పరిశీలిస్తున్న సీఐ నయిముద్దీన్

సాక్షి క్లాసిఫైడ్స్

SERVICES

■ శ్రీ రామ్ గోల్డ్ మీ బంగారం తాకట్టులో ఉందా? వడ్డీ చెల్లించ లేకపోతున్నారా? తాకట్టులో ఉన్న బంగారం విడిపించి ఈ రోజు మార్కెట్ ధరకు కొనబడును. ఫోన్ :9133214214 [H-788626]

WANTED

■ త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఫ్రీ వసతి+ భోజనం, జీతం 1BK, ఫోన్ : 9963114535, 7287061111 [HA-189330]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/ డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

ప్రోత్సాహం కరువు!

- మట్టి గణపతుల తయారీదారుల దీనస్థితి
- ఉచిత విగ్రహాల పంపిణీతో ఉపాధి కరువు
- ప్రభుత్వం సబ్సిడీ రుణం అందించాలని వేడుకోలు


మట్టి విగ్రహాల తయారీ

రామచంద్రాపురం(పటాన్‌చెరు): వినాయక చవితి వస్తుందంటే చాలు గ్రామాలు, పట్టణాల్లో చిన్నా పెద్దా చేసే సందడి అంతాఇంత కాదు. గణపతి విగ్రహాల కొనుగోలుతోపాటు మండపాల ఏర్పాటు, డెకరేషన్ చేయడంలో ప్రతిఒక్కరూ బిజీబిజీగా ఉంటారు. అయితే రంగులు, రసాయనాలతో తయారు చేసిన వినాయక ప్రతిమలను ప్రతిష్ఠించడం వల్ల జల కాలుష్యం ఏర్పడుతుందని, తెలంగాణ సర్కార్ మట్టి వినాయకులను నెలకొల్పేలా ప్రోత్సహిస్తుంది. ప్రతీ సంవత్సరం మున్సిపాలిటీల ఆధ్వర్యంలో మట్టి వినాయకులను ప్రజలకు ఉచితంగా పంపిణీ చేసేలా చర్యలు తీసుకుంటుంది. దీనివల్ల మట్టి వినాయకుల తయారీదారులకు సరైన ఆదాయం లేక ఇబ్బంది పడుతున్నారు. ప్రభుత్వం సబ్సిడీపై రుణాలు అందించి ప్రోత్సాహం అందించాలని వారు కోరుతున్నారు.

వినాయక చవితి సమీపిస్తుండడంతో తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని రహదారులపై రంగురంగుల వినాయకుల అమ్మకాలు జోరుగా సాగుతున్నాయి. పర్యావరణ పరిరక్షకులు, పండితులు మట్టి గణపతి విగ్రహాలను పూజించాలని అవగాహన కల్పిస్తుండటంతో ఈ ప్రాంత ప్రజలు 35 ఏళ్లుగా మట్టి గణపతులను పూజిస్తూ అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారు. వీటిని నిమజ్జనం చేసినప్పుడు నీళ్లలో త్వరగా కరిగిపోయే అవకాశం ఉంటుంది. కొంత కాలంగా పాలకులు, స్వచ్ఛంద సంస్థలు, యువజన సంఘాలు ప్రజలకు ఉచితంగా మట్టి గణపతి విగ్రహాలను పంపిణీ చేస్తున్నారు. కానీ, మట్టి గణపతి విగ్రహాలను తయారు చేసేవారికి ప్రభుత్వం ఎలాంటి ప్రోత్సాహం అందించడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సబ్సిడీపై రుణాలు అందించి ఆదుకోవాలని వేడుకుంటున్నారు.

తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని ఇందిరానగర్‌లో నివాసముండే కుమ్మరి శంకర్ కుటుంబం 30 ఏళ్లుగా మట్టి విగ్రహాలను వివిధ రూపాల్లో తయారు చేస్తున్నారు. గతంలో విగ్రహాల తయారీకి కావాల్సిన బంక మట్టిని స్థానిక చెరువులో నుంచి తీసుకొచ్చేవారు. కానీ అవి కాస్త కాలుష్యం కావడంతో ఇతర ప్రాంతాల నుంచి తెచ్చుకుంటున్నారు.

ట్రాక్టర్ బంకమట్టికి రూ.25 వేలు చెల్లిస్తున్నారు. దీని ద్వారా 8 ఇంచుల నుంచి 5 అడుగుల విగ్రహాలను తయారు చేస్తున్నారు. వీటిని సైజులను బట్టి రూ.35నుంచి రూ.500 వరకు విక్రయిస్తున్నారు. 6 నెలల ముందు నుంచే విగ్రహాలను తయారు చేస్తున్నా అనుకున్న స్థాయిలో రాబడి రావడం లేదని తయారీదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మట్టి విగ్రహాలను ఉచితంగా పంపిణీ చేయడం వలన తక్కువ ధరకే విగ్రహాలను అమ్ముకోవాల్సిన పరిస్థితి నెలకొందని వారు వాపోతున్నారు.

సబ్సిడీపై రుణం ఇవ్వాలి

30 ఏళ్లుగా మట్టి గణపతులను తయారు చేస్తున్నాం. తమకు శ్రమకు తగిన ఫలితం రావడం లేదు. పలువురు మట్టి విగ్రహాలను ఉచితంగా పంపిణీ చేయడం వలన మేము తక్కువ ధరకే విక్రయిస్తున్నాం. ప్రభుత్వం సబ్సిడీపై రుణాలు ఇచ్చి ప్రోత్సహించాలి.

– కుమ్మరి శంకర్, మట్టి విగ్రహాల తయారీదారుడు, తెల్లాపూర్



జనవరి నుంచి మొదలుపెడతాం

జనవరి నుంచే మట్టి విగ్రహాల తయారి మొదలుపెడతాం. ప్రతీ ఏడాది సుమారు 4వేల విగ్రహాలను తయారుచేస్తాం. ఇందులో లాభాలు రాకపోయినా వృతిని కొనసాగిస్తున్నాం.

– కళ్యాణ్, వ్యాపారి, తెల్లాపూర్

అభివృద్ధికి తెలంగాణ దిక్సూచి

ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి

తొగుట(దుబ్బాక): తెలంగాణ అభివృద్ధి దేశానికి దిక్సూచిగా నిలిచిందని మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్ రెడ్డి తెలిపారు. తొగుటలో పంచాయతీరాజ్ శాఖ డివిజన్ కార్యాలయాన్ని మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. తొగుట, రాయపోల్, దౌల్తాబాద్ మండలాలకు ప్రభుత్వం డీఈఈ కార్యాలయం మంజూరు చేయడం గొప్ప విషయమన్నారు. తొగుట సబ్ డివిజన్ ఏర్పాటుతో మూడు మండలాలకు సౌకర్యంగా ఉంటుందన్నారు. ఉపఎన్నికలో ఓడిపోయినా దుబ్బాక అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని స్పష్టంచేశారు. అనంతరం మండలంలోని వెంకట్రావుపేట ఎస్సీ కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి రూ. 5లక్షలు మంజూరు పత్రాలను ఎంపీ అందజేశారు. అలాగే తుక్కాపూర్, వెంకట్రావుపేట గ్రామాలకు చెందిన నర్సయ్యకు, నజీమొద్దీన్‌లకు సీఎం సహాయ నిధి చెక్కులు అందజేశారు. కార్యక్రమంలో దౌల్తాబాద్ జడ్పీటీసీ రణం జ్యోతి, దుబ్బాక ఆత్మ కమిటీ చైర్మన్ భాస్కరాచారి, ఎంపీపీ ఉపాధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ హరికృష్ణారెడ్డి, ఏఎంసీ చైర్మన్ కొమురయ్య, సర్పంచ్‌లు కొండల్‌రెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, మల్లయ్య, నర్సింలు, ఎంపీటీసీ సభ్యులు స్వామి, నర్సింలు, శరత్, కోఆప్షన్ సభ్యుడు కలీముద్దీన్ తదితరులు పాల్గొన్నారు.


తొగుటలో పీఆర్ డీఈ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ఎంపీ ప్రభాకర్‌రెడ్డి

అంగన్‌వాడీ టీచర్లతో వెట్టిచాకిరీ

ఎమ్మెల్యే రఘునందన్‌రావు

దుబ్బాకటౌన్: బీఆర్ఎస్ ప్రభుత్వం అంగన్‌వాడీ టీచర్లతో వెట్టిచాకిరీ చేయిస్తుందని ఎమ్మెల్యే మాధవనేని రఘునందన్‌రావు అన్నారు. మంగళవారం దుబ్బాక ఐసీడీఎస్ కార్యాలయం వద్ద అంగన్‌వాడీలు చేస్తున్న సమ్మెకు ఆయన సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. అంగన్‌వాడీలకు సంబంధం లేని పనులు చేయిస్తున్నారని ఆరోపించారు. ఓటర్ నమోదుతో పాటు చాలా పనులకు వినియోగించుకుంటూ వారి న్యాయమైన డిమాండ్లను మాత్రం పట్టించుకోవడం లేదన్నారు. వారికి మద్దతుగా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువస్తానని ఆయన హామీ ఇచ్చారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు బాలేష్‌గౌడ్, మచ్చ శ్రీనివాస్, ప్రవీణ్ తదితరులు ఉన్నారు.

బతుకమ్మ ఆటతో నిరసన

దుబ్బాకలో బతుకమ్మ ఆటతో అంగన్‌వాడీలు ప్రభుత్వానికి తమ నిరసన తెలిపారు. సుమారు 2 గంటల పాటు ఐసీడీఎస్ కార్యాలయం ఎదుట తమ డిమాండ్లు పరిష్కారించాలని పాటలు పాడుతూ బతుకమ్మ ఆడారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా నాయకుడు భాస్కర్, పద్మ, నాగరాణి, భూలక్ష్మి, బసవరాణి, రమ, విజయ తదితరులు ఉన్నారు.


అంగన్‌వాడీల సమ్మెకు మద్దతు తెలుపుతున్న ఎమ్మెల్యే రఘునందన్‌రావు

పారదర్శకంగా కేసుల పరిశోధన

సిద్దిపేట సీపీ శ్వేత

సిద్దిపేటకమాన్: పారదర్శకంగా కేసుల పరిశోధన ఉండాలని, పెండింగ్‌లో ఉన్న సీసీ నెంబర్లు త్వరగా తీసుకోవాలని సిద్దిపేట సీపీ శ్వేత అన్నారు. పోలీసు కమిషనర్ కార్యాలయంలో పోలీసు అధికారులతో పెండింగ్ కేసులు, ఫంక్షనల్ వర్టికల్‌పై సీపీ మంగళవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కోర్టులో పెండింగ్ గ్రేవ్ ట్రయల్ కేసులు డిస్పోజల్ అయ్యేవిధంగా చర్యలు తీసుకోవాలన్నారు. 2021, 22 సంవత్సరంలో అండర్ ఇన్వెస్టిగేషన్‌లో ఉన్న కేసులు త్వరగా డిస్పోజల్ చేయాలని సూచించారు. నాన్ బెయిలబుల్ వారెంట్ ఎగ్జిక్యూట్ చేయాలన్నారు. రోడ్డు ప్రమాదాల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని సూచించారు. జాతీయ స్థాయిలో ఉత్తమ పోలీసు స్టేషన్లుగా ఎంపిక కావడానికి అధికారులు, సిబ్బంది పోటీపడి విధులు నిర్వర్తించాలన్నారు. సీసీటీఎన్ఎస్ ద్వారా ప్రతి దరఖాస్తు వివరాలు నమోదు చేయాలన్నారు. సమావేశంలో అడిషనల్ డీసీపీలు అడ్మిన్ శ్రీనివాసరావు, లా అండ్ ఆర్డర్ మల్లారెడ్డి, మహిళ పోలీసు స్టేషన్ సీఐ దుర్గ, హుస్నాబాద్ పోలీసు అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సీపీ శ్వేత

మల్లన్నా.. ఏదీ రక్షణ?

- కొమురవెల్లి ఆలయంలో సీసీ కెమెరాల సిస్టం ధ్వంసం
- గుడి ఆవరణలో పనిచేయని కెమెరాలు
- సిబ్బందే ధ్వంసం చేశారని ఆలయ చైర్మన్ ఆరోపణ

కొమురవెల్లి(సిద్దిపేట): కొమురవెల్లి మల్లికార్జున స్వామి ఆలయంలో సీసీ కెమెరాలకు సంబంధించిన సిస్టం(ఎన్‌వీఆర్) ధ్వంసమైంది. దీంతో దేవాలయంలోని 32 కెమెరాలు పని చేయడం లేదు. గుడి పరిసరాలలో పనిచేసే సీసీ కెమెరాల సిస్టం యూనిట్‌ను ఏఈవో గదిలో అమర్చారు. ప్రస్తుతం దీనిని పగులకొట్టడంతో సీసీ కెమెరాలు పని చేయక నిత్యం స్వామివారి దర్శనానికి వచ్చే వేలాది మంది భక్తులకు రక్షణ కరువైంది. ఎవరో కావాలనే ఉద్దేశపూర్వకంగా ధ్వంసం చేసినట్లుందని టెక్నీషియన్ చెబుతున్నాడు. దీంతో ఆలయంలో సిబ్బందిపై అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. వారం క్రితం ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల గొడవ గురించి సీసీ ఫుటేజీ తీసుకుందామని మంగళవారం టెక్నీషియన్‌ను పిలిపించగా ఎన్‌వీఆర్ ధ్వంసమైన విషయం తెలిసింది. ఆలయ చైర్మన్ గీస భిక్షపతి వెంటనే విలేకరుల సమావేశం నిర్వహించి ఉద్యోగులే సీసీ కెమెరాల సిస్టం యూనిట్‌ను ధ్వంసం చేశారని ఆరోపించారు. కొద్దిరోజులుగా ఈయనకు, ఏఈఓ అంజయ్య మధ్య విభేదాలు తలెత్తడంతో ఆలయంలో ఎప్పుడు ఏం జరుగుతుందో తెలియకుండా ఉంది.


ధ్వంసం అయిన సిస్టం యూనిట్

ఇది ఆలయ సిబ్బంది పనే..

ఆలయంలో పనిచేసే సిబ్బందే సీసీ కెమెరాలు పని చేయకుండా చేశారు. వీటి సిస్టం యూనిట్ ఏఈఓ అంజయ్య గదిలో ఉంది. ఆయనే కావాలని ధ్వంసం చేశారు. గతంలో కూడా డాటాను డిలీట్ చేశారు. దీనిపై దేవాదాయ శాఖ కమిషనర్‌కు ఫిర్యాదు చేస్తా.

– గీస భిక్షపతి, ఆలయ చైర్మన్



కక్ష సాధింపు చర్యలు

ఆలయంలో సీసీ కెమెరాల సిస్టంను ధ్వంసం చేయవలసిన అవసరం నాకు లేదు. చైర్మన్ కావాలనే కక్ష సాధింపు చర్యకు పాల్పడుతూ నాపై ఆరోపణలు చేస్తున్నారు. నాకు ఎలాంటి సంబంధం లేదు. ఉన్నతాధికారులు విచారణ చేపట్టి విషయాన్ని బహిర్గతం చేయాలి. చైర్మన్ గీస భిక్షపతే ధ్వంసం చేయించి నాపై నిందలు వేస్తున్నారు.

– అంజయ్య, ఏఈఓ

హత్యా.. ఆత్మహత్యా..?

- అనుమానాస్పద స్థితిలో యువతి మృతి
- రైలు పట్టాలపై మృతదేహం లభ్యం

జహీరాబాద్ టౌన్: పట్టణంలోని అల్లీపూర్ వద్ద రైలు పట్టాలపై అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన యువతి శవాన్ని మంగళవారం రైల్వే పోలీసులు గుర్తించారు. వికారాబాద్ రైల్వే పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు. జహీరాబాద్ మండలం కొత్తూర్(బి) గ్రామానికి చెందిన మడపతి వీరయ్యస్వామి ట్రైడెంట్ చక్కెర కర్మాగారంలో కార్మికుడిగా పనిచేస్తున్నాడు. ఆయనకు ఇద్దరు కూతుళ్లు, ఒక కుమారుడు ఉన్నారు. పెద్ద కూతురి వివాహం కాగా, రెండో కుమార్తె మడపతి నందిని(20) హైదరాబాద్‌లోని కూకట్‌పల్లి హాస్టల్‌లో ఉంటూ చదువుకుంటుంది. నగరంలో ఉంటున్న ఆమె అల్లీపూర్ వద్ద రైలు పట్టాలపై శవమై కనిపించింది. వికారాబాద్ రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహం వద్ద లభించిన సెల్‌ఫోన్‌లోని నంబర్ల ఆధారంగా కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. నందిని ఆత్మహత్య చేసుకుందా..? ఎవరైనా హత్యచేశారా..? అనే విషయం తెలియాల్సి ఉంది. తండ్రి వీరయ్యస్వామి ఫిర్యాదు మేరకు వికారాబాద్ పోలీసులు అనుమానాస్పద మృతి కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


నందిని(ఫైల్)

అప్పుల బాధ తాళలేక ఆత్మహత్య

మిరుదొడ్డి(దుబ్బాక): అప్పుల బాధ తట్టుకోలేక ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన అక్బర్‌పేట–భూంపల్లి మండల పరిధిలోని మోతెలో మంగళవారం జరిగింది. మృతుని కుటుంబ సభ్యులు గ్రామస్తులు తెలిపిన కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన నీల బాలయ్య (48) తనకున్న రెండు ఎకరాల్లో వ్యవసాయం చేసుకుంటూ భార్య కనకవ్వ, ముగ్గురు కొడుకులు బాల్‌రాజు, నాగరాజు, వేణును పోషించుకుంటున్నాడు. మూడేళ్ల క్రితం జరిగిన రోడ్డు ప్రమాదంలో బాలయ్యకు తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం సుమారు రూ.3లక్షల వరకు అప్పు చేశాడు. వ్యవసాయం కోసం మరికొంత అప్పు చేశాడు. చేసిన అప్పులు తీర్చే మార్గం తెలియక బాలయ్య మనస్తాపానికి గురయ్యాడు. మంగళవారం ఉదయం పొలం వద్దకు వెళ్లి తాను చనిపోతున్నానని రెండో కుమారుడు నాగరాజుకు ఫోన్ చేసి తెలిపాడు. కుటుంబ సభ్యులు పొలం వద్దకు వెళ్లి చూడగా అప్పటికే బాలయ్య చెట్టుకు ఉరి వేసుకుని మృతి చెంది ఉన్నాడు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని దుబ్బాక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.మృతుని భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు భూంపల్లి ఎస్ఐ భువనేశ్వర్‌రావు తెలిపారు.


బాలయ్య (ఫైల్)

ఏసీ రిపేర్ నెంబర్ కోసం వెతికితే..

రూ.2.96 లక్షలు దోచేసిన సైబర్ నేరగాళ్లు



పటాన్‌చెరు టౌన్: ఏసీ రిపేర్ కోసం గూగుల్లో నెంబర్ కోసం శోధించి ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి సైబర్ వలలో చిక్కుకుని రూ.2.96 లక్షలు పోగొట్టుకున్న సంఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల తెలిపిన వివరాలు. పటాన్‌చెరు మండలం ఇంద్రేశంకు చెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగి సెప్టెంబర్ 9న ఏసీ రిపేర్ చేసే వారి కోసం గూగుల్లో శోధించాడు. ఈ క్రమంలో బాధితుడికి ఓ ఫోన్ నెంబర్ కనిపించగా దానికి కాల్ చేశాడు. దీంతో అపరిచిత వ్యక్తి చెప్పిన విధంగా యాప్‌ను ఇన్‌స్టాల్ చేసుకుని అపరిచిత వ్యక్తి చెప్పిన విధంగా ఓటీపీలు చెప్తూ వచ్చాడు. దీంతో అతని ఖాతాలో ఉన్న రూ.2.96లక్షలు మాయమయ్యాయి. బాధితుడు మోసపోయినట్లు గుర్తించి ముందుగా సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అనంతరం మంగళవారం పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

స్వచ్ఛ్ బడి అద్భుతం: యూనిసెఫ్ బృందం

సిద్దిపేటజోన్: సిద్దిపేటలో ఏర్పాటు చేసిన స్వచ్ఛ్ బడి అద్భుతంగా ఉందని యూనిసెఫ్ బృందం కితాబు ఇచ్చింది. మంగళవారం వివిధ దేశాలకు చెందిన ప్రతినిధులు జిల్లాలో పర్యటించారు. ఇందులో భాగంగా స్వచ్ఛ్ బడిని సందర్శించారు. వారికి జిల్లా అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్, మున్సిపల్ చైర్ పర్సన్ మంజుల, కమిషనర్ సంపత్ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వారు స్వచ్ఛ్ బడిలో క్లాత్ బ్యాంక్‌ను పరిశీలించారు. ప్లాస్టిక్ రహిత పట్టణంగా మార్చే క్రమంలో అందరూ జ్యూట్ బ్యాగ్స్, క్లాత్ బ్యాగ్స్ వాడేలా చైతన్యవంతం చేస్తున్న విషయాన్ని బల్దియా అధికారులు బృందానికి వివరించారు. స్టీల్ బ్యాంక్ ఏర్పాటు, చెత్త ద్వారా సేంద్రియ ఎరువుల తయారీ, రుతు ప్రేమ అమలు తీరు గురించి వారికి తెలియజేశారు. అనంతరం స్వచ్ఛ్ బడిలో నర్సరీ, గోశాల, సేంద్రియ ఎరువుల తయారీ ప్రక్రియ పరిశీలించారు. ఈ సందర్భంగా స్పెయిన్ దేశ ప్రతినిధి ఓన మాట్లాడారు. తన భర్త రవికుమార్ భారత్‌కు చెందిన వ్యక్తి కావడంతో మెట్టినిల్లుకు వచ్చిన అనుభూతి ఉందన్నారు. తనకు ఇక్కడి పద్ధతులు అంటే చాలా ఇష్టమని అన్నారు. కార్యక్రమంలో లిడిజ, తానియా, మార్టిన్జో, టాప్స్ ,వాన్, కుపర్, ఓటినో, ఫెనండో, టిమో, డ్యూక్, సైమన్ తదితరులు పాల్గొన్నారు.


స్వచ్ఛ్ బడిని సందర్శించిన విదేశీ బృందం

ముందు వెళ్తున్న వాహనాన్ని ఢీకొట్టి..

కారు డ్రైవర్ మృతి

పటాన్‌చెరు టౌన్: ముందు వెళ్తున్న వాహనాన్ని కారు ఢీకొట్టిన ఘటనలో డ్రైవర్‌కు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతిచెందిన సంఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్ఐ నాగేశ్వరావు తెలిపిన వివరాలు. అమీన్‌పూర్ మండల పరిధిలోని నవ్యనగర్‌కు చెందిన పటేల్ శ్రీనివాస్(45) క్యాబ్ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. ఈ క్రమంలో మంగళవారం తెల్లవారుజామున లింగంపల్లి వైపు నుంచి సంగారెడ్డి వైపు కారు డ్రైవింగ్ చేసుకుంటూ వెళ్తున్న శ్రీనివాస్ పటాన్‌చెరు మండలం ముత్తంగి చర్చి సమీపంలో ముందు వెళ్తున్న గుర్తుతెలియని వాహనాన్ని ఢీకొట్టాడు. దీంతో అతనికి తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్త పటాన్‌చెరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుడి తమ్ముడు శ్రీకాంత్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

లారీ ఢీకొని..

పటాన్‌చెరు టౌన్: లారీ ఢీకొని వ్యక్తి మృతిచెందిన ఘటన పటాన్‌చెరు పోలీసుస్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్ఐ నాగలక్ష్మి తెలిపిన వివరాలు. మధ్యప్రదేశ్‌కు చెందిన గోపాల్ టైగ(53) పటాన్‌చెరు ప్రయాణ ప్రాంగణం ఎదుట జాతీయ రహదారిపై సోమవారం తెల్లవారుజామున నడుచుకుంటూ వెళ్తున్నాడు. ఈ క్రమంలో అతన్ని లారీ ఢీకొనడంతో తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి జేబులోని ఆధార్ ఆధారంగా మధ్యప్రదేశ్‌కు చెందిన వ్యక్తిగా గుర్తించారు. కుటుంబ సభ్యులకు సమాచారం అందించి, పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రెండు బైక్‌లు ఢీ.. ఇద్దరికి తీవ్ర గాయాలు

శివ్వంపేట(నర్సాపూర్): ఎదురెదురుగా రెండు బైక్‌లు ఢీకొని ఇద్దరికి తీవ్ర గాయాలైన సంఘటన మండల పరిధి ఉసిరికపల్లి బస్టాండ్ సమీపంలోని తూప్రాన్- నర్సాపూర్ హైవేపై సోమవారం రాత్రి జరిగింది. ఉసిరికపల్లి గ్రామానికి చెందిన కుందనపల్లి మరియా, స్వామి దంపతులు వస్తున్న బైక్, హైదరాబాద్‌కు చెందిన సయ్యద్ సిద్దికి మోంది వస్తున్న బైక్ ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో స్వామి తలకు తీవ్ర గాయాలు కాగా, సయ్యద్ సిద్దికి మోంది కాలు విరిగింది. స్థానికులు వారిని తూప్రాన్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

గల్లంతైన వ్యక్తి మృతదేహం లభ్యం


శివ్వంపేట(నర్సాపూర్): చేపలు పట్టేందుకు వెళ్లిన వ్యక్తి గల్లంతు కాగా, మంగళవారం మృతదేహం లభ్యమైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం .. దొంతి గ్రామానికి చెందిన బాలోల్ల కృష్ణయ్య(55) సోమవారం మధ్యాహ్నం ఇంట్లో నుంచి వెళ్లి రాత్రి వరకు తిరిగి రాలేదు. మంగళవారం ఉదయం శభాష్‌పల్లి పంచాయతీ పరిధిలోని పిల్లిగుండ్ల మత్తడి కుంటలో కృష్ణయ్య మృతదేహం కనిపించింది. కుటుంబ సభ్యులు ఘటన స్థలానికి చేరుకుని బోరున విలపించారు. చేపలు పట్టేందుకు కుంటలోకి దిగి ప్రమాదవశాత్తు మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు. మృతుడి భార్య కృష్ణమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు ఎస్ఐ రవికాంత్‌రావ్ తెలిపారు.

జరిమానా వేస్తారనే భయంతో..

రామాయంపేట(మెదక్): చోరీ కేసులో పట్టుబడిన ఓ వ్యక్తి జరిమానా వేస్తారనే భయంతో చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన మండలంలోని ప్రగతి ధార్మారంలో మంగళవారం వెలుగులోకి వచ్చింది. ఎస్ఐ రంజిత్ తెలిపిన వివరాలు. గ్రామానికి చెందిన బండారి యాదాగౌడ్ (42)కు భార్యాపిల్లలున్నారు. కొంతకాలంగా మద్యానికి బానిసై ఏ పని చేయకుండా జులాయిగా తిరుగుతున్నాడు. ఈనెల 9న గ్రామంలోని పెద్దమ్మ గుడిలో చోరీకి ప్రయత్నించి గ్రామస్తులకు పట్టుబడ్డాడు. గ్రామంలో పంచాయతీ నిర్వహించి జరిమానా వేస్తారనే భయంతో 10వ తేదీన ఇంటి నుంచి వెళ్లిపోయిన యాదాగౌడ్ చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. అతని మృతదేహం మంగళవారం తేలింది. మృతుని భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అనారోగ్య సమస్యలతో..

జిన్నారం(పటాన్‌చెరు): అనారోగ్య సమస్యల కారణంగా ఓ వ్యక్తి భవనం పైనుంచి దూకి ఆత్మహత్య చేసుకున్న ఘటన జిన్నారం మండలం బొల్లారం మున్సిపల్ పరిధిలో మంగళవారం చోటు చేసుకుంది. సీఐ నయిమోద్దీన్, స్థానికులు తెలిపిన వివరాలు. బిహార్ రాష్ట్రానికి చెందిన బ్రిజ్‌నందన్ ప్రసాద్(65) కుటుంబంతో కలసి బొల్లారం బాలాజీనగర్‌లో అద్దెకు ఉంటున్నాడు. స్థానికంగా ఓ పరిశ్రమలో పనిచేసేవాడు. ఆరు నెలల నుంచి ప్రసాద్ అనారోగ్యంతో ఇబ్బంది పడుతున్నాడు. మంచానికే పరిమితం కావడంతో మనస్తాపం చెంది నివాసం ఉంటున్న ఐదంతుస్తుల భవనం నుంచి దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతదేహాన్ని పటాన్‌చెరు ప్రభుత్వ ఆస్పత్రిఇకి తరలించారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.


బ్రిజ్‌నందన్ ప్రసాద్ (ఫైల్)

కుటుంబ సమస్యలతో..

అల్లాదుర్గం(మెదక్): ఆర్థిక ఇబ్బందులు, కుటుంబ సమస్యల కారణంగా ఆత్మహత్యకు యత్నించిన ఓ వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందిన సంఘటన మంగళవారం అల్లాదుర్గం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ ప్రవీణ్‌రెడ్డి తెలిపిన వివరాలు. చిల్వెర గ్రామానికి చెందిన జిల దుర్గయ్య(35) ఆర్థిక ఇబ్బందులు తట్టుకోలేక గత నెల 27న ఇంట్లో గడ్డిమందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. అతన్ని జోగిపేట ఆస్పత్రికి, అక్కడి నుంచి నిమ్స్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం ఉదయం మృతి చెందాడు. మృతుడి భార్య సుజాత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చెప్పారు.


దుర్గయ్య (ఫైల్)